క్లుప్తంగా

29న ఆడికృత్తిక



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీన ఆడికృత్తిక ఉత్సవాలు జరగనున్నాయని ఈఓ ఎస్‌వీఎస్‌ మూర్తి తెలిపారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆడికృత్తిక వాల్‌ పోస్టర్‌ను ఈఓ ఎస్‌వీఎస్‌ మూర్తి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 24న అంకురార్పణ, 25న ధ్వజారోహణం, 29న ఆడికృత్తిక, 30న రథోత్సవం, 31న కల్యాణోత్సవం, ఆగస్టు ఒకటో తేదీన పార్వేట ఉత్సవం, 2న ధ్వజావరోహణం, 3న పల్లకీసేవ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరస్వామి సేవలో యశ్వంత్‌ గురూజీ



యశ్వంత్‌ గురూజీకి పరశురామేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న గిరినాయుడు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామివారిని సోమవారం యశ్వంత్‌ గురూజీ దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్వాహకులు యశ్వంత్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.ఆలయ మాజీ చైర్మన్‌ గిరినాయుడు, పద్మనాభ నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌ స్టేడియంలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. కరాటే మాస్టర్‌ సంపత్‌కుమార్‌ నేతృత్వంలో కరాటేలో తలపడిన విద్యార్థులు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి, బహుమతులు సాధించారు. విజేతల్లో జశ్వంత్‌యాదవ్‌, నిఖిత, కిరణ్‌కుమార్‌, క్రాంతికుమార్‌, జ్యోతీశ్వర్‌, అక్షయ, దీక్షిత, శ్రీశాంత్‌, మాధుర్యశ్రీ, చాతుర్యశ్రీ ఉన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌ నిర్మూలన



మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్‌: అవగాహనతో క్యాన్సర్‌ మహమ్మారిని నిర్మూలించాలని టాటా ట్రస్ట్‌ అధికారి హేమంత్‌ పిలుపునిచ్చారు. సోమవారం వినాయకనగర్‌లోని రాస్‌ క్లస్టర్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్‌ వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళల్లో గర్భసంచి, రొమ్ముక్యాన్సర్‌ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని పరీక్షలు చేసుకుంటూ ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయించుకుంటే వ్యాధిని జయించవచ్చని సూచించారు. అనంతరం మహిళలకు క్యాన్సర్‌ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రాస్‌ సిబ్బంది రామానుజులు, పద్మావతి, నాగేశ్వరరావు, వెంకయ్యబాబు, అమరావతి పాల్గొన్నారు.

టీటీడీ విద్యాలయాల్లో పేద పిల్లల ప్రవేశానికి వినతి

తిరుపతి(అలిపిరి): టీటీడీ విద్యాలయాల్లో పేద విద్యార్థుల ప్రవేశానికి సహకారం అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్‌ సభ్యుడు వడిత్యా శంకర్‌ నాయక్‌ కోరారు. సోమవారం ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావుకు ఆయన వినతిపత్రం సమర్పించారు. మౌలిక సదుపాయాలు, సీట్ల కేటాయింపులు డిమాండ్‌కు తగ్గట్టు సరిపోవడం లేదని, అందరికీ అడ్మిషన్‌తో పాటు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

న్యాయమూర్తులకు శిక్షణ

తిరుపతి లీగల్‌: రాయలసీమ జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులను సోమవారం జిల్లా జడ్జి భీమారావు ప్రారంభించారు. స్థానిక శ్వేతా భవనంలో ఈనెల 26వ తేదీ వరకు జడ్జిలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథం, రిటైర్డ్‌ జడ్జి, సీనియర్‌ ట్రైనర్‌ హరీష్‌ దుడాని, సామాజిక కార్యకర్త న్యాయవాది ట్రైనర్‌ నీనా కరే తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం.. పొందులాభం

కర్షకుడికి నేడు పాడి, పంట రెండు కళ్లు లాంటివి. పంట సాగు చేస్తున్న ప్రతి రైతు పాడిని ఆశ్రయిస్తే మంచి లాభాలుంటాయి. అయితే పశుపోషణకు పచ్చిగడ్డి వాడితే అధిక ప్రయోజనాలు ఉంటాయి. అధిక పాల ఉత్పత్తితో పాటు పాడిపశువులు ఆరోగ్యంగా ఉంటాయి. ఆ పచ్చిగడ్డిలోనూ మేలైన రకాలైతే మరీ లాభదాయకం. ఆ రకాలేవో చూద్దాం.. సాగు చేసి సిరుల పంట పండిద్దాం.

- పోషకాలున్న పచ్చిగడ్డి మేలు
- పశువుల ఆరోగ్యానికి దోహదం
- అధిక పాల దిగుబడికి అవకాశం



కోబాక పొలాల్లో రైతులు సాగు చేసిన పశుగ్రాసం

ఏర్పేడు: పాల ఉత్పత్తి గణనీయంగా పెరగాలంటే అధిక పోషకాలు ఉన్న పశుగ్రాసం ఎంతో అవసరం. సహజంగా పశుగ్రాసం అంటే రైతులకు వెంటనే గుర్తొకొచ్చేది వరిగడ్డి, పచ్చిగడ్డి. వరిగడ్డిలో పోషకాలు చాల తక్కువగా ఉండటమే కాకుండా జీర్ణం కాని భాగం ఎక్కువ ఉంటుంది. పచ్చిగడ్డి మంచి పశుగ్రాసమే కానీ అందులో కొన్ని రకాలు వాడితే పశువులకు అధిక పోషకాలు ఉన్న ఆహారం అందడమేకాకుండా పాలదిగుబడి కూడా పెరుగుతుంది. అధిక పోషకాలున్న పశుగ్రాసాలు నాలుగు రకాలున్నాయి. వాటిని ధాన్యపు జాతి, గడ్డి జాతి, కాయ జాతిగా విభజించారు. వీటిలో ధాన్యపు జాతి పశుగ్రాసాలు ఎక్కువ పోషకాలు కలిగి ఉంటాయి.

లూసర్ను రకం

ఈ పశుగ్రాసాన్ని ఏక వార్షిక, బహు వార్షిక విధాలుగా సాగు చేసుకోవచ్చు. మాంసకృత్తులు, కాల్షియం అధికంగా ఉండి పచ్చిమేతగా, ఎండు మేతగా కూడా ఉపయోగించుకోవచ్చు. అన్ని రకాల సారవంతమైన భూముల్లో సాగుచేసుకోవచ్చు. ఎకరాకు 6 కిలోల నుంచి 8 కిలోల విత్తనాలను వేయాల్సి ఉంటుంది. మొదటి పర్యాయం విత్తేటప్పుడు బ్యాక్టీరియా కల్చర్‌తో కలిపి విత్తడం మంచిది. అక్టోబరు నుంచి నవంబరు మధ్య దీన్ని నాటుకునేందుకు అనువైన సమయం. విత్తిన 70 రోజుల అనంతరం మొదటి కోతకు వస్తుంది. తరువాత ప్రతి 25 రోజుల వ్యత్యాసంతో 6,7 కోతలు కోయవచ్చు. ఎకరాకి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

హైబ్రిడ్‌ నేపియర్‌

ఈ గడ్డి రకం ఎక్కువ పరకలతో ఎక్కువ ఆకులు కలిగి రుచికరంగా ఉంటుంది. నీటి పారుదల కలిగిన అన్ని భూముల్లో సాగు చేసుకోవచ్చు. ఏడాది పొడవునా పశుగ్రాసాన్ని సాగు చేసుకోచ్చు. జూన్‌, జూలై నెలల్లో నాటుకుంటే పశుగ్రాసాన్ని అందుబాటులోకి తెచ్చుకోవచ్చు. నాటిన 70, 75 రోజులకు మొదటి కోతకు వస్తుంది. ప్రతి 40 రోజులకు ఒకసారి కోత కోయవచ్చు. ఒకసారి నాటితే 4 ఏళ్ల వరకు ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి ఎకరాకి 60 నుంచి 70 టన్నుల పశుగ్రాసం దిగుబడికి వస్తుంది.

స్వీట్‌ సూడాన్‌

ఇది జొన్న రకానికి చెందిన పశుగ్రాసం. ఎత్తుగా, ఏపుగా పెరిగి అధిక పశుగ్రాసాన్ని ఇస్తుంది. ఖరీఫ్‌ సీజన్‌లో 80 శాతం పచ్చిమేత ఈ రకం పశుగ్రాసం తీరుస్తుంది. ఇది తక్కువ వర్షపాతం కలిగిన ప్రాంతాల్లో సాగు చేసుకోవచ్చు. ఈ రకాన్ని జనవరి నుంచి ఆగస్టు వరకు సాగు కోవచ్చు. మూడు నుంచి నాలుగు కోతలు వస్తుంది.

అధిక పాల ఉత్పత్తి

వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పశుగ్రాసం పెట్టి పాడి పశువులను పోషిస్తే వాటికి బలవర్ధకమైన పశుగ్రాసం అందుతుంది. తద్వారా అధిక పాల ఉత్పత్తి సాధించవచ్చు. పచ్చిమేత పెట్టి మేపితే పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. అధిక పాల ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. దీంతో పాడి రైతుల కుటుంబ ఆదాయం పెరుగుతుంది.

–శిల్పారెడ్డి, పశువైద్యురాలు, ఏర్పేడు మండలం



నేటి నుంచి టీఎంఎల్‌ ప్రదర్శన



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి

నాగలాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానం -2020 నాలుగో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా సోమవారం ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు ఆధ్వర్యంలో టీఎంఎల్‌ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. దీనికి సెక్టోరియల్‌ అధికారులు, ఏఎస్‌ఓ, మండల ఇన్‌చార్జ్‌ సారథి, ఏపీఓ గోపాల్‌ రెడ్డి, ఏఏఎంఓ మధు, ఏసీఎంఓ రాము హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ఈ రోజు నుంచి టీఎంఎల్‌ ప్రదర్శన అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు శిక్షా సప్తాహ్‌ను వివరించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన టీఎంఎల్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌ కుమార్‌, గిరిబాబు, సురేంద్ర, అనిల్‌, సునీల్‌, మోహన్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై చిత్తశుద్ధి చూపండి



వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న శ్రీనివాసరావు

నారాయణవనం: విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా రోగులు, పిల్లలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై క్షేత్ర స్థాయి సిబ్బంది శ్రద్ధ చూపాలని జిల్లా టాస్క్‌ ఫోర్స్‌ నోడల్‌ అధికారి, డీపీహెచ్‌ఎంవో డాక్టర్‌ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అయన మండలంలోని కొండలచెరువు సబ్‌ సెంటర్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అయన సిబ్బందికి సూచనలు చేసి, సమీక్షించారు. కొండలచెరువులో గర్భిణులు, బాలింతలు, పిల్లల నుంచి రక్త నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించి, ఏఎన్‌ఎంలకు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మాత, శిశు వివరాలు ఆరోగ్య ఆసరా, జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకాలను అర్హులందరికీ అందివ్వాలని ఆయన అన్నారు. అర్హులైన దంపతులకు శాశ్వత, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను వివరించాలని స్టాటిస్టికల్‌ అధికారి నాగేంద్ర సూచించారు. పీఎం మాతృ వందన పథకం ద్వారా గర్భిణుల ఖాతాల్లో నగదు బదిలీ రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న సేవలు, పిల్లల టీకాలు, ఐరన్‌, క్యాల్షియం టాబ్లెట్స్‌ పంపిణీ రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ డాక్టర్లు దర్శిత్‌ రాజ్‌, రాగసుధ, హెల్త్‌ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ ఇందిర

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రిగలో రాస్‌ మహిళా భారతి, తిరుపతి నవజీవన్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మడిబాక, రాజులకండ్రిగ, బీసీ కాలనీ నుంచి వచ్చిన 134 మంది రోగులు పరీక్షలు చేసుకోగా వీరిలో 35 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి రెండు రోజుల్లో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్‌ చేయనున్నారు. కార్యక్రమంలో రాస్‌ మహిళా భారతి ప్రాజెక్ట్‌ అధికారి బాలాజీరెడ్డి, డాక్టర్‌ ఇందిర, రాస్‌ సంస్థ ప్రతినిధులు నాగమణి, సరస్వతి, లక్ష్మి, వెంకట్‌కుమార్‌, మునిపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం



తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న దేవదేవేరులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు సోమవారం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వెంకన్నను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ స్పెషల్‌ గ్రేడ్‌ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్‌, సూపరింటెండెంట్‌ చెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి గ్రంధి శ్రీనివాస్‌ సోమవారం తీర్పు చెప్పారు. అధిక మోతాదులో మద్యం తాగి ఆటో నడుపుతున్న తిరుపతి దామినేడుకు చెందిన ఆటో డ్రైవర్‌ ఎస్‌వీ బాలాజీరావుకు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, మరో కేసులో తిరుపతి, టాటా నగర్‌కు చెందిన జి.శ్రీధర్‌కు రెండు రోజులు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానాను న్యాయమూర్తి విధించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందికి రూ.10వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్లు కోర్టు కానిస్టేబుల్‌ గిరిబాబు తెలిపారు.

సీఐకి బెయిలబుల్‌ వారెంట్‌

తిరుపతి లీగల్‌: ఓ క్రిమినల్‌ కేసులో దర్యాప్తు అధికారిగా ఉండి సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు హాజరు కానందున సీఐ సుబ్రమణ్యంరెడ్డికి బెయిల్‌బుల్‌ వారెంట్‌ జారీ చేస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి వై.సరిత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుచానూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో 2022 జూన్‌ 29వ తేదీన తిరుపతి రూరల్‌, సాయినగర్‌ పంచాయితీ, జయనగర్‌లోని ఓ ఇంటిలో రెండు సెల్‌ ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్‌ కీ బోర్డు, రూ.6వేల నగదు అపహరణకు గురైంది. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు అప్పటి తిరుచానూరు సీఐ వి.సుబ్రమణ్యంరెడ్డి కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆ కేసు విచారణ జరుగుతోంది. ఈ మేరకు సీఐ సుబ్రమణ్యంరెడ్డి కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలని ఇదివరలో కోర్టు సమన్లు పంపింది. అయితే ఆయన ఎంతకాలమైనా కోర్టుకు హాజరు కాకపోవడంతో సీఐకి బెయిల్‌బుల్‌ వారెంట్‌ జారీ చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు చేశారు. కేసును ఈనెల 26వ తేదీకి వాయిదా వేశారు.

నేడు ఆధార్‌ నమోదు ప్రారంభం

సత్యవేడు: మండలంలో ఈ నెల 23 నుంచి 27వరకు ప్రత్యేక ఆధార్‌ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌ తెలిపారు. దాసుకుప్పం, ఇరుగుళంలో 23 నుంచి 25 వరకు, చెరివి, సిరుణంబూదూరులో 26, 27 తేదీల్లో ఆయా సచివాలయాల్లో ఆధార్‌ నమోదులో చిరునామా, ఫొటోమార్పు, ఆధార్‌ కార్డుతో వేలి ముద్రల నమోదు, ఆధార్‌తో మొబైల్‌ నంబరు అనుసంధానం పనులను డిజిటల్‌ అసిస్టెంట్లు ప్రకాష్‌, బాలాజీ నిర్వహించనున్నట్లు వివరించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రేమలత

ఏర్పేడు: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచాలని ఎంఈఓ ప్రేమలత అన్నారు. సోమవారం మండలంలోని ఆమందూరు ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్‌ వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షా సప్తాహ్‌ వారోత్సవాలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఈ వారోత్సవాల్లో మొదటి రోజున స్థానికంగా లభించే వనరులతో బోధనకు సంబంధిన వివిధ రకాల బోధనా ధ్యసనా సామగ్రిని సేకరించి, విద్యా బోధనకు ఎలా ఉపయోగపడుతాయన్న విధానాన్ని వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవయ్య, ఉపాధ్యాయులు ఆదినారాయణ, బాటముని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటకోత్సవాలు



శ్రీమతి కల్యాణం నాటకంలోని ఓ సన్నివేశం

తిరుపతి కల్చరల్‌: అభినయ ఆర్ట్స్‌ జాతీయ నాటక, నృత్య పోటీలలో భాగంగా మూడో రోజు సోమవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య పోటీల్లో 200 మంది కళాకారులు నృత్యాభినయం చేసి అలరింపజేశారు. మధ్యాహ్నం శ్రీవాసవి కళాపరిషత్‌ వారు ప్రదర్శించిన శ్రీమతి కల్యాణం పౌరాణిక పద్య నాటిక ఆధ్యాత్మికత భావాలను రేకెత్తించింది. విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్‌ వారు ప్రదర్శించిన నాలోన నీవే సాంఘిక నాటిక కుటుంబ వ్యవస్థ విశిష్టతను ఆవిష్కరించింది.

28న పోటీ పరీక్షలపై అవగాహన

తిరుపతి సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలపై ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని గిండీస్‌ ఐఏఎస్‌ అకాడమీలో ఈ నెల 28వ తేదీన ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్‌ డాక్టర్‌ సురేష్‌ కుమార్‌ గిండి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యూపీఎస్సీ చేపట్టే సివిల్స్‌, ఎస్‌ఎస్‌సీతో పాటు ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్‌ పరీక్షలు, బ్యాంక్‌ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు అత్యున్నతమైన శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందు కోసం ఆదివారం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే విడుదలైన గ్రూప్‌–1, గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌లో సుమారు 50మందికిపైగా మెయిన్స్‌ పరీక్షకు అర్హత సాధించడం విశేషమన్నారు. గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ రేషన్‌కార్డు కలిగిన పేద విద్యార్థుల కోసం ఫీజులో 50శాతం రాయితీతో ప్రత్యేక ప్యాకేజీ అందిస్తున్నామన్నారు.

వైభవంగా ధ్వజావరోహణం



పూజలు చేస్తున్న పండితులు



ధ్వజావరోహణం కార్యక్రమంలో అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజావరోహణం వైభవంగా నిర్వహించారు. ఈ ఘట్టంతో 12 రోజుల పాటు జరిగిన ఉత్సవాలు ముగిశాయి. ఆలయ పండితులు మంత్రోచ్చారణల నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభానికి కట్టిన చీరలను ఆచారం ప్రకారం కిందకు దింపారు. ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామివారి ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి



మాట్లాడుతున్న తహసీల్దార్‌

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్‌ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి పరిష్కరించాలని తహసీల్దార్‌ మహ్మద్‌ పటాన్‌ ఆలీఖాన్‌ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల ప్రజావేదికను సిబ్బందితో కలసి నిర్వహించారు. అనంతరం ఆయన వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్‌ డే రోజున వచ్చిన వినతులను విచారించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు, మండల సర్వేయరు వెంకట్రామయ్య, వీఆర్‌ఓలు, పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నప్రసాదాలు



అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న గోవిందమాల భక్తులు

నారాయణవనం: తిరుమలకు పాదయాత్రగా వెలుతున్న గోవిందమాల భక్తులకు సోమవారం స్థానికులు అన్నప్రసాదాలను అందజేశారు. తమిళ ఆడి నెల ప్రారంభం నుంచి వేంకటేశ్వరస్వామికి ప్రీతిపాత్రమైన పెరటాసి నెల వరకు చెన్నై నుంచి అధిక సంఖ్యలో భక్తులు గోవిందమాలను ధరించి నారాయణవనం మీదుగా తిరుమలకు నడుచుకుని వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. తిరుమలకు నడచి వెళుతున్న చెన్నైకి చెందిన సుమారు 150 మందికి స్థానిక రేషన్‌ డీలర్‌ కందస్వామి, పంచాయతీ అధికారి రవి, కేబుల్‌ టీవీ ఆపరేటర్‌ గిరి అన్నప్రసాదాలను అందజేశారు. కందస్వామి, రవి, గిరి, మాట్లాడుతూ స్థానికంగా కొందరి స్నేహితులతో కలిసి గత 12 సంవత్సరాలుగా చెన్నై నుంచి కాలినడకన తిరుమల మళయప్పస్వామి దర్శనార్థం వెళ్లే భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. భక్తులతో పాటు స్థానికులు అన్నప్రసాదాలను అందుకున్నారు.

రైతులకు నారు పంపిణీ



రైతులకు నారు పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలోని రాస్‌ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ శ్రీనివాసులు రైతులకు ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం ఉచితంగా నారు పంపిణీ చేశారు. రాస్‌ కేవీకే కార్యాలయంలో రైతులకు ఉద్యాన పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కూరగాయలు, పూల పెంపకంలో మేలైన వంగడాల సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. బెంగళూరు ఐఐహెచ్‌ఆర్‌ వారు రూపొందించిన తీగ చిక్కుడులో అర్క కృష్ణ, అర్క ప్రసిద్ధి, టమాటలో అర్క సామ్రాట్‌, బంతిలో అర్క అభి వంటి మేలైనా వంగడాల నారు మొక్కలను క్షేత్ర పరిశీలనలు, ప్రదర్శనల నిమిత్తం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్‌, పద్మజ, శ్రీలత, దివ్య, అనూష, కార్వేటినగరం, కేవీబీ పురం, చిన్నగొట్టిగల్లు మండలాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కస్తూరప్పస్వామి ఆలయ కుంభాభిషేకం



కలశాలను తీసుకెళుతున్న నిర్వాహకులు

వరదయ్యపాళెం: మండల కేంద్రం నుంచి అరుదూరుకు వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన శ్రీ కస్తూరప్ప స్వామి ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వరదయ్యపాళెం దళితవాడ ప్రజలకు కులదైవమైన కస్తూరప్ప స్వామికి సోమవారం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో ఆలయ గోపుర శిఖర కలశానికి మహాకుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు, మాజీ సర్పంచ్‌ బొప్పన తిలక్‌బాబు, విశ్రాంత గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ బొప్పన మోహన మురళి, రమేష్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కడ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రమాదకరంగా మోదీ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేష్‌

తిరుపతి కల్చరల్‌ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన ప్రమాదకరంగా, సంకీర్ణ ధర్మానికి భిన్నంగా సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేష్‌ విమర్శించారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ దేశ ప్రజల తిరస్కారానికి గురయ్యారన్నారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించారని తెలిపారు. ప్రతిపక్ష నేతలను జైలుకు పంపడం ద్వారా ప్రజలను భయకంపితులను చేశారని విమర్శించారు. చంద్రబాబు కూడా మోదీపై తిరుగుబాటు చేసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కనిపించడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన ఎన్‌డీయే ప్రభుత్వం అరాచక పాలన చేస్తోందని మండిపడ్డారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు హరినాథరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, నాయకులు శివారెడ్డి, పార్థసారథి, సీహెచ్‌ ప్రభాకర్‌, చిన్నం పెంచలయ్య, రామచంద్రయ్య, నదియా పాల్గొన్నారు.

హక్కులను హరించేందుకే కొత్త చట్టాలు



పౌర చైతన్య వేదిక నూతన కార్యవర్గం

తిరుపతి సిటీ: పౌర హక్కులు హరించి, పోలీసు రాజ్యం తెచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్‌ చట్టాలను తీసుకువచ్చిందని పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షుడు రాఘవశర్మ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్‌ కళాశాల ఆవరణలో పలువురు మేధావులు, విద్యావంతులు సమావేశం నిర్వహించారు. రాఘవశర్మ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని, వీటి కోసం యువత పశ్నించాల్సి అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక పాలనను నిలదీసేందుకు పౌర చైతన్య వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని వెల్లడించారు. సమాజ మార్పులో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. అనంతరం పౌర చైతన్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్‌ మాట్లాడుతూ సామాజిక స్పృహ లేని పౌరులుగా యువత తయారు కావడం ఆందోళకమని తెలిపారు. యువతను చైతన్యవంతం చేసి సామాజిక కార్యక్రమాల వైపు ప్రొత్సహించనున్నట్లు చెప్పారు. పౌర చైతన్య వేదిక నూతన కార్యదర్శి ఏఎన్‌ పరమేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.